ఆసియా హమారా

అరంగేట్రం మహిళల అండర్-19 ఆసియాకప్‌లో యువ భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం పూర్తి ఏకపక్షంగా సాగిన ఆఖరి పోరులో భారత్..బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిష అర్ధసెంచరీతో చెలరేగిన వేళ.. పోరాడే స్కోరు అందుకున్న టీమ్‌ఇండియా.. ఆయూశి, సోనమ్, పరునిక స్పిన్ తంత్రంతో బంగ్లాను కుప్పకూల్చింది. ఇటీవలే ఇదే ఆసియాకప్ అండర్-19 ఫైనల్లో బంగ్లా చేతిలో భారత కుర్రాళ్లకు ఎదురైన పరాజయానికి అమ్మాయిలు ప్రతీకారం తీర్చుకున్నట్లయ్యింది.

ఫైనల్లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం • అర్ధసెంచరీతో అదరగొట్టిన త్రిష

కౌలాలంపూర్: అండర్-19 మహిళల ఆసియాకప్ టోర్నీలో యువ భారత్ కప్ కొట్టేసింది. తొలిసారి ప్రవేశపెట్టిన టోర్నీలో టైటిల్‌ను ఒడిసిపట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో యువ భారత్ 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. టాస్ గెలిచిన బంగ్లా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ గొంగడి త్రిష(47 బంతుల్లో 52, 5ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు మిథిలా వినోద్(17) ఆకట్టుకోవడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 117/7 స్కోరు చేసింది. ఫర్జానా ఇసా మిన్(4/31) నాలుగు వికెట్లతో విజృంభించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా 18.3 ఓవర్లలో 76 పరుగులకు కుప్పకూలింది. స్పిన్నర్లు ఆయూశీ శుక్లా(3/17), పరుని సిసోడియా(2/12), సోనమ్‌యాదవ్(2/13) స్పిన్ మాయాజాలంతో బంగ్లా పతనాన్ని శాసించారు. వీరి స్పిన్ ధాటికి బంగ్లా జట్టులో ఫిర్దోస్(22), ఫహిమిద(18) మినహా అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. ఛేదనలో ఒకానొక దశలో బంగ్లా 7 ఓవర్లకు 44/2 స్కోరుతో మెరుగ్గా కనిపించిన బంగ్లా..భారత స్పిన్నర్ల విజృంభణతో 32 పరుగుల తేడాతో చివరి 8 వికెట్లు కోల్పోయి ఓటమి వైపు నిలిచింది. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన త్రిషకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

త్రిష (52)

త్రిష ధమాకా:

తెలంగాణ యువ బ్యాటర్ త్రిష అదరగొట్టింది. ఓపెనర్‌గా దిగిన త్రిష..టోర్నీలో సూపర్ ఫామ్ కొనసాగిస్తూ ఫైనల్లో విజృంభించింది. జట్టు స్కోరు 23 పరుగులకే ఓపెనర్ కమలిని(5) వికెట్ కోల్పోయిన భారత్‌ను ఈ యువ హైదరాబాదీ బ్యాటర్ కాపాడింది. ఫర్జానా పేస్ ధాటికి సహచర ప్లేయర్లు వరుసగా పెవిలియన్ చేరుతున్నా..ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఇన్నింగ్స్‌ను గాడిలో పడేసింది. సనికా చాల్కె(0) డకౌట్‌గా వెనుదిరుగగా, కెప్టెన్ నికీ ప్రసాద్(12)తో కలిసి నాలుగో వికెట్‌కు 41 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఈ క్రమంలో తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, రెండు భారీ సిక్స్‌లలో అలరించింది. త్రిష..మినహా జట్టులో ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోవడంతో టీమ్ 117/7 స్కోరుకు పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 117/7(త్రిష 52, మిథిల 17, ఫర్జానా 4/31, నిశిత 2/23), **బంగ్లాదేశ్:** 18.3 ఓవర్లలో 76 ఆలౌట్(ఫిర్దోస్ 22, ఫహిమిద 18, ఆయూశి 3/17, పరునిక 2/12)

రోహిత్‌కు గాయం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో కీలకమైన బాక్సింగ్ డే టెస్టుకు ముందు భారత్‌కు ఎదురు దెబ్బ. ఆదివారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కెప్టెన్ రోహిత్‌శర్మ గాయపడ్డాడు. ప్రాక్టీస్ పిచ్‌లపై త్రోడౌన్ స్పెషలిస్టు దయానంద్ గరానీ వేసిన బంతిని ఆడే క్రమంలో రోహిత్ ఎడమ కాలికి గాయమైంది. నొప్పితో బాధపడుతూ కనిపించిన హిట్‌మ్యాన్ ఐస్‌ప్యాక్‌తో కొద్దిసేపు సేదతీరాడు. అయితే గాయం తీవ్రతపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ప్రాక్టీస్ సెషన్ ముగిసిన తర్వాత పేసర్ ఆకాశ్‌దీప్‌సింగ్ మాట్లాడుతూ రోహిత్ ప్రస్తుతం బాగానే ఉన్నాడని పేర్కొన్నాడు. సోమవారం ప్రాక్టీస్‌కు విశ్రాంతి అని తెలిపాడు. ఇదిలా ఉంటే ప్రాక్టీస్ కోసం కేటాయించిన పిచ్‌లు మరీ నాసిరకంగా ఉన్నట్లు టీమ్‌ఇండియా క్రికెటర్లు వాపోయారు. అసలు ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా లేవని అన్నారు.

అమెరికా కెప్టెన్ అనికకు సన్మానం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే అమెరికా మహిళల జట్టు కెప్టెన్ కొలన్ అనికా రెడ్డి, లెగ్‌స్పిన్నర్ ఇమ్మడి శాన్విని సెంటర్ ఫర్ క్రికెట్(సీఎఫ్‌సీ) ఎక్సలెన్స్ అకాడమీ ఘనంగా సన్మానించింది. ఆదివారం అకాడమీ నిర్వహకులు భరణి, చీఫ్‌కోచ్ జగదీశ్ రెడ్డి కలిసి అభినందించారు. అమెరికా అండర్-19 జట్టులో కీలక ప్లేయర్లు ఉన్న వీరు తెలుగు మూలాలు కల్గిన వారు. గత కొద్ది నెలలుగా హైదరాబాద్‌లో ఐసీసీ లెవల్-3 కోచ్ జగదీశ్‌రెడ్డి దగ్గర వీరు శిక్షణ తీసుకుంటున్నారు. వీరికి సీఎఫ్‌సీ నిర్వాహకులు భరణి క్రికెట్ కిట్లను అందజేశారు. భవిష్యత్ లోమరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

దేవాంశ్ ప్రపంచ రికార్డు

చెస్‌లో వేగంగా పజిల్స్ చేయడంలో ఫీట్

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాంశ్ చెస్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. లాస్లో పోల్గర్ బుక్ '5334 ప్రాబమ్స్ అండ్ గేమ్స్' నుంచి తీసుకున్న 175 చెక్‌మేట్ పజిల్స్‌ను దేవాంశ్ 11ని మిషాల 59సెకన్ల వ్యవధిలో పరిష్కరించడంలో సఫలీకృతమయ్యాడు. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగిన ఈ ఫీట్‌ను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్(లండన్) ప్రతినిధులు గుర్తించి సర్టిఫికేట్ అందజేశారు. దీనికి తోడు ఇటీవల దేవాంశ్ మరో రెండు ప్రపంచ రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం నిమిషం 43సెకన్లలో పూర్తిచేశాడు. 9 చెస్ బోర్డులను కేవలం 5నిమిషాల్లో అమర్చాడు. మొత్తం 32 పావులను వేగవంతంగా సరైన స్థానాల్లో నిలిపాడు. ప్రపంచ రికార్డు ప్రయత్నాలను లండన్ ప్రతినిధులు గుర్తించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. దేవాంశ్ ప్రదర్శన పట్ల లోకేశ్ సంతోషం వ్యక్తం చేశాడు.

విండీస్‌పై భారత్ రికార్డు విజయం

రేణుక పాంచ్ పటాకా • మందన అర్ధసెంచరీ

వడోదరా: భారత మహిళల జట్టు వరుస విజయాలతో దుమ్మురేపుతున్నది. టీ20 సిరీస్ విజయంతో ఊపుమీదున్న టీమ్‌ఇండియా వన్డేల్లోనూ అదే జోరు కనబరిచింది. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో 211 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. పరుగుల తేడా పరంగా మహిళల వన్డేల్లో భారత్‌కు ఇదే అత్యుత్తమంగా రికార్డుల్లోకెక్కింది. తొలుత స్మృతి మందన (102 బంతుల్లో 91, 13ఫోర్లు) అర్ధసెంచరీకి తోడు హర్లిన్‌డియోల్ (44), ప్రతికా రావల్ (40) రాణించడంతో టీమ్‌ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 314/9 భారీ స్కోరు సాధించింది. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ మందన.. విండీస్ బౌలర్లపై విరుచుకుపడింది. పసలేని బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ తన ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లతో ఆకట్టుకుంది. జైదా జేమ్స్ (5/45) ఐదు వికెట్లతో రాణించింది. ఛేదనకు దిగిన విండీస్..రేణుకా ఠాకూర్ (5/29) ధాటికి 26.2 ఓవర్లలో 103 పరుగులకు చాపచుట్టేసింది. అలె ఫ్లెచర్ (24 నాటౌట్) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. పిచ్‌ను తనకు అనుకూలంగా మలుచుకుంటూ రేణుక వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ సూపర్ క్యాచ్‌తో ఆకట్టుకుంది. ఐదు వికెట్లతో జట్టు విజయంలో కీలకమైన రేణుకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

రేణుకా (5/29)

రూట్ రీఎంట్రీ

• ఇంగ్లండ్ వన్డే జట్టుకు ఎంపిక

లండన్: భారత్‌తో వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇంగ్లండ్ ఎంపిక చేసిన జట్టులో స్టార్ బ్యాటర్ జోరూట్ చోటు దక్కించుకున్నాడు. ఆదివారం 15 మందితో ప్రకటించిన జట్టులో రూట్‌కు చాన్స్ ఇచ్చారు. దాదాపు ఏడాది తర్వాత రూట్ తిరిగి జట్టులోకి రానున్నాడు. గాయంతో ఇబ్బంది పడుతున్న స్టార్‌ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్టులో స్టోక్స్ గాయపడ్డాడు. భారత పర్యటనలో భాగంగా ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో పాటు మూడు వన్డేలు ఆడనుంది. బట్లర్ ఇంగ్లండ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌లు

కరాచీ: ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచ్‌లు దుబాయ్‌లో జరిగే అవకాశం కనిపిస్తున్నది. యూఏఈ క్రికెట్ బోర్డుకు చెందిన షేక్ నహ్యాన్ అల్ ముబారక్‌తో ఆదివారం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) చీఫ్ మోహిసిన్ నఖ్వి చర్చలు జరిపారు. ఇందులో తటస్థ వేదికగా దుబాయ్ వైపు పీసీబీ మొగ్గుచూపినట్లు తెలిసింది. హైబ్రిడ్ మోడల్‌లో భాగంగా టీమ్‌ఇండియా.. పాకిస్థాన్‌లో కాకుండా తటస్థ వేదికపై మ్యాచ్‌లు ఆడనుంది. ఒకవేళ భారత్ నాకౌట్‌కు అర్హత సాధిస్తే.. యూఏఈలో సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

సెమీస్‌లో రౌనక్, ఆదర్శిని

బెంగళూరు: 86వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో రౌనక్ చౌహాన్, ఆదర్శిని శ్రీ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో రౌనక్ 21-10, 21-16తో 14వ సీడ్ అలప్ మిశ్రాపై అలవోక విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆదర్శిని 23-21, 21-12తో శ్రేయా లెలెపై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించింది.

ఈసారి ఆ తప్పు జరగదు..

ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2 - శౌర్యాంగపర్వం'ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం 'సలార్ 2' అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ' 'సలార్' భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో 'కేజీఎఫ్' ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. 'సలార్ 2 - శౌర్యాంగపర్వం'లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ కథ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇది దేవా- వరదా అనే ఇద్దరు స్నేహితుల కథ. మలుపులు, కుదుపులు లేకపోతే కథ రక్తికట్టదు. స్నేహం సాఫీగా సాగితే కిక్కుండదు. అందుకే.. కష్టమైనా సరే.. వారిద్దర్నీ విడగొట్టాలి. వారి మధ్య ఓ పెద్ద అపార్థం సృష్టించాలి. ఒకరినొకరు అపార్థం చేసుకోవాలి. శత్రువులుగా మారాలి. ఈ తర్వాత ఏమైంది? అనేది తెరపైనే చూడాలి. దాన్ని ఇప్పుడే రివీల్ చేయలేను.' అంటూ నవ్వేశారు ప్రశాంత్‌నీల్.

చిత్రం

అది నిజంగా నా విజయమే

'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాల భామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్ట్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంత మంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రీ.

క్రికెట్‌కి సచిన్.. ఇండియన్ సినిమాకు శంకర్

'శంకర్‌గారు కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్ గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లాస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ''రంగస్థలం'కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. 'గేమ్ చేంజర్' క్లైమాక్స్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.' అని తెలిపారు. 'మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్ సినిమా తీయడం ఇదే ప్రథమం. శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్క్రీన్ పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలు ఈ సినిమాలో చాలా కనిపిస్తాయి. శంకర్‌గారు అన్నీ తానై నడిపించారు. ఈసారి మామూలుగా కొట్టడంలేదు. గట్టిగా కొట్టబోతున్నాం.' అని దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేశారు. శంకర్ మాట్లాడుతూ 'పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ 'గేమ్‌ఛేంజర్' చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు. ఈ సినిమాకి అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. రేపు ఆ కష్టాన్ని తెరపై చూస్తారు.' అని శంకర్ చెప్పారు. ఇంకా అంజలి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాత అనిల్ సుంకర, డైరెక్టర్ బుచ్చిబాబు, ఎస్‌జే సూర్య కూడా మాట్లాడారు.

ఓ తండ్రి తీర్పు

వివ రెడ్డి, రాజేంద్ర, ప్రతాప్, శ్రీరామ్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ప్రతాప్ భీమవరపు దర్శకుడు. లయన్ శ్రీరామ్ దత్తి నిర్మాత. డాక్టర్ కె.వి.రమణాచారి ఆశీస్సులతో ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. రమణాచారి మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో రూపొందిన చిత్రమిది. ఆస్తులపై ఉన్న ప్రేమ తమపై లేకపోవడం తల్లిదండ్రుల్ని ఎంత క్షోభకు గురిచేస్తుందో ఈ సినిమాలో చూపించారు. ఇందులో కొడుకుగా వివ రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. అతని పాత్ర చాలామంది కొడుకులకు కనువిప్పు కలిగేలా ఉంటుంది. ఓ మంచి కుటుంబ కథాచిత్రాన్ని విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అన్నారు. కునాల్, కుషాల్, చిత్రం బాషా, అనురాధ, రారాజు, సురభి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రచన: రాజేంద్రరాజు కాంచనపల్లి, కెమెరా: సురేష్ చెటిపల్లి, సంగీతం: మధు బాపుశాస్త్రి.

గోదారిగట్టు ప్రేమకథ

సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందుతున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రానికి సుభాష్‌చంద్ర దర్శకుడు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్నది. పశ్చిమగోదావరి జిల్లాలోని రేలంగి, భీమవరం ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపారు. యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయి సంతోష్, సంగీతం: నాగవంశీకృష్ణ

ఏకంగా నలుగురు స్టార్లతో?..

'జవాన్'తో ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల సునామీని సృష్టించాడు దర్శకుడు అట్లీ. మరి నెక్స్ట్ అట్లీ సినిమా ఎవరితో ఉంటుంది? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. సల్మాన్, విజయ్ కాంబినేషన్లో మల్టీస్టారర్ చేయబోతున్నట్టు గతంలో వార్త లొచ్చాయి. అయితే.. విజయ్ పాలిటిక్స్ ఎంట్రీతో ఆ సినిమా లేనట్టే అని తేలిపోయింది. మరి నెక్స్ట్ ఏంటి? అని అంతా అనుకుంటున్న తరుణంలో.. ఓ అద్భుతమైన అప్‌డేట్ ఇచ్చేశాడు అట్లీ. ప్రస్తుతం తన తాజా సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, ఈ సినిమాలో స్టార్స్‌ని చూసి అంతా ఆశ్చర్యపోతారని, అవుటాఫ్ ది వరల్డ్ ఐడియాతో ఈ సారి సినిమా చేస్తున్నానని అట్లీ చెప్పుకొచ్చారు. ఇండియాలోనే బిగ్గెస్ట్ మల్టీస్టారర్‌గా ఈ సినిమా ఉండబోతున్నదట. ఇందులో ఏకంగా నలుగురు స్టార్లు నటించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. వారిలో తెలుగు నుంచి కూడా ఓ ప్రముఖ హీరో నటించనున్నట్టు తెలుస్తున్నది.

యాపిల్‌ని కన్నడలో ఏమంటారో చెప్పండి?..

కన్నడ స్టార్ సుదీప్ ప్రస్తుతం తన తాజా సినిమా 'మ్యాక్స్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కన్నడ మీడియాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సుదీప్‌తో ఓ విలేఖరి.. 'మీరు కన్నడ నటుడు అయ్యుండి సినిమాకు ఇంగ్లిష్‌లో పేరు ఎందుకు పెట్టారు?' అని ప్రశ్నించాడు. దాంతో సుదీప్ కాసేపు మౌనంగా ఉండిపోయారు. అనంతరం ఆ విలేఖరి వైపు సూటిగా చూస్తూ.. అతనికి తనముందున్న మైకుల్ని చూపిస్తూ.. వీటిని కన్నడంలో ఏమంటారు? అనడిగారు. సదరు విలేఖరి నుంచి సమాధానం లేదు. 'సరే.. వీటిని ఇంగ్లిష్‌లోనే ఎందుకు పిలుస్తారు?.. నేను కన్నడ నటుడ్నని ప్రపంచానికి తెలుసు. ఎందుకంటే కన్నడలోనే మాట్లాడతాను కాబట్టి. నేనున్న సినిమా కన్నడ సినిమా అని కూడా అందరికీ తెలుసు. ఇక పేరుతో ప్రమేయం ఏముంది? అలా అయితే.. కర్ణాటకలో ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ ఉండకూడదు. అసలు మీ సమస్య ఏంటి? ఏ ఫర్ యాపిల్ అంటారు కదా.. యాపిల్‌ను కన్నడలో ఏమంటారో చెప్పండి?' అని ప్రశ్నించే సరికి సదరు విలేఖరి నీళ్లు నమిలాడు.

మర్రిచెట్టు కింద మనోళ్లు

ప్రమోద్‌దేవా, రణధీర్, కీర్తన, స్వర్గం ముస్కాన్, రాజేందర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు'. నరేష్‌వర్మ ముద్దం దర్శకుడు. శ్రీ నారసింహ చిత్రాలయ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఆదివారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు బాబూమోహన్ క్లాప్ కొట్టగా, నటుడు నాగమహేష్ కెమెరా స్విచాన్ చేశారు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ, రాజీవ్ కనకాల, ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదరప్రసాద్, నిర్మాత సి.కల్యాణ్, రష్మి ఠాగూర్ అతిథులుగా పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. 'మర్రిచెట్టు కింద మనోళ్లు' అనే టైటిల్ వల్ల ప్రారంభానికి ముందే సినిమా జనాల్లోకి వెళ్లిపోయిందని దర్శకుడు చెప్పారు. చిత్రంలో నటించడం పట్ల పాత్రధారులంతా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా సహ నిర్మాతలు ఆకుల రిషేంద్ర నరసయ్య, బీసు చందర్ గౌడ్ కూడా మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.